

## దేశంలోని ప్రధాన డ్యామ్‌ల భద్రతపై కేంద్రం ఫోకస్

నాగార్జునసాగర్‌లో స్పిల్‌వే,గేట్లపై ప్రత్యేక తనిఖీలు

అత్యవసర పరిస్థితులకు ముందస్తు చర్యలపై సూచనలు

భద్రతలో రాజీలేదని స్పష్టం చేసిన ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ డ్యామ్ భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో,భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఎ) చైర్మన్ అనిల్ జైన్ శనివారం డ్యామ్‌ను విస్తృతంగా పరిశీలించారు.దేశంలోని ప్రధాన జలవనరుల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈసందర్శన ప్రాధాన్యతను సంతరించుకుంది.హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నాగార్జునసాగర్‌కు చేరుకున్న ఈ బృందంలో ఎన్‌డీఎస్‌ఏ దక్షిణ ప్రాంత రీజినల్ డైరెక్టర్ ఆర్.గిరిధర్,డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. మొదటి రోజు డ్యామ్‌కు చేరుకున్న అనంతరం,అధికారులు డ్యామ్ నిర్మాణం,నిర్వహణ విధానాలపై సమగ్ర అవగాహన పొందారు.ప్రత్యేకంగా డ్యామ్‌లోని స్పిల్‌వే, గేట్లు, నీటి విడుదల వ్యవస్థలు, నిర్మాణ బలం వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా తనిఖీలు నిర్వహించారు.భద్రతా ప్రమాణాల అమలు, ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగం,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. డ్యామ్ నిర్వహణలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై కూడా పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చైర్మన్ అనిల్ జైన్ మాట్లాడుతూ డ్యామ్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.భవిష్యత్తులో వరదలు,ఇతర అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఆదివారం ఉదయం మరికొన్ని ప్రాజెక్టు కీలక భాగాలను పరిశీలించిన అనంతరం బృందం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానుంది.ఈకార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌ఈ మల్లికార్జున రావు, ఏఈలు కృష్ణయ్యతో పాటు ఇతర ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి?

**ఎంత అడ్డుకోవాలని చూసినా ఆగదు - ఇది దైవ కార్యం : సిఎం రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈశ్వరుడి ఆశీర్వాదంతో మూసీ నది ప్రక్షాళన చేపడుతామని,ఇందుకు ఎవరైనా అడ్డుపడితే రాష్ట్ర ప్రభుత్వం శివతాండవం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ఏదీ ఏమైనా.. ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడికి వచ్చినా..ఈ ప్రాజెక్టు చేసి తీరుతాము. ఇది మా దీక్ష ఇది మా శివ దీక్ష రామప్ప మందిరంలో రుద్రదేవున్ని మొక్కుకొని బయలుదేరినం. ప్రజాపాలన తెస్తాం, ప్రజలకు మేలు చేస్తామని. ఆ రామప్ప ఆలయ నామూననే ఈ రోజు మంచిరేవులలో నిర్మించాలని మేము అనుకుంటున్నం. ఆ రామప్ప శివుని సాక్షిగా చెప్పదల్చుకున్న ఖచ్చితంగా మూసీనది ప్రక్షాళనే కాదు.. గొప్ప ఆలయాన్ని నిర్మించి, దక్షిణ కాశీగా రాణిచ్చే విధంగా ఈ పుణ్యక్షేత్రాన్ని ముందుకు తీసుకెళ్తాం..మీరందరూ అండగా నిలబడండి. ఆశీర్వదించండి. ఈ అభివృద్ధి చూపించి, మేము ఓట్లు అడుగం, ఈ అద్భుతమైన అభివృద్ధి చూసి ఓట్లు అడుగుతరమో అనుకుంటున్నారు. మేం ఓట్ల కోసం.. నోట్ల కోసం.. ఈ అభివృద్ధి కాదు' అని ముఖ్యమంత్రి అన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర దేవాలయ నిర్మాణానికి సిఎం రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని సిఎం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతామని, రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అని నిలదీశారు. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక అని అన్నారు.

**ఎన్‌జిటి కేసు వెనక్కి తీసుకోకపోతే.. సామాజిక బహిష్కరణ తప్పదు..**

తాము చేయలేనిది ఎవ్వరూ చేయొద్దనే అక్కసుతోనే కొందరు స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవాలని చూస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో పదవులు అనుభవించిన 'మా అక్క' కుమారుడు అభివృద్ధిని అడ్డుకునేందుకు 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్'లో కేసు వేశారన్నారు. ప్రాంత అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజా ప్రతినిధిగా ఉండే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. 'మా అక్కకు ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా. నీ పుత్ర రత్నం నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో వేసిన కేసును వెనక్కి తీసుకోవాలి. లేకపోతే ప్రజలే మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తారు' అని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి సిఎం వ్యాఖ్యానించారు. 'మీ వెనక ముసుగు తొడుక్కున్న వారికీ చెబుతున్నా..ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రస్తుతం ఉన్న స్థానం కూడా వారికి ఉండదు' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు.

**మూసీ ఒడ్డున మజిదు, చర్చి, గురుద్వారా నిర్మిస్తాం..**

మూసీ తీరాన్ని అద్భుతమైన పర్యాటక, వ్యాపార, ధ్యాన కేంద్రంగా మారుస్తామని సిఎం రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు. మూసీ ఒడ్డున మసీదు, చర్చి, గురుద్వారా కూడా నిర్మిస్తామన్నారు. గోదావరి నుంచి 20 టిఎంసిలను హైదరాబాద్‌కు తరలిస్తామని, మూసీ నదిలో ఎప్పుడూ నీళ్లు ఉండేలా చూస్తామన్నారు. కాలుష్యం వల్ల భావితరాలు నాశనమయ్యే ప్రమాదం ఉన్నదని, మానవ తప్పిదాలను అరికట్టాలని, లేదంటే భావితరాలు నష్టపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన..**

శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారని, ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉందని వివరించారు. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది చేసిన ప్రయత్నాలు ముందుకు సాగలేదని, ఇందుకు కారణాలు ఏవైనప్పటికీ , ప్రస్తుతం ఈ అవకాశం తమకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగిందని వివరించారు. మూసీ, ఈసీ నదులు ఉన్నప్పటికీ వాటిని సరైన విధంగా ఉపయోగించుకోలేదని, మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని చెప్పారు.

**హైదరాబాద్‌ను మరో 'ఢిల్లీ కాలుష్యం' కానివ్వం..**

హైదరాబాద్ నగరాన్ని మరో ఢిల్లీ కాలుష్య నగరంగా కానివ్వబోమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు .ఢిల్లీ లాంటి నగరాల్లో కాలుష్యంతో జన జీవనం స్తంభించిందని, అలాంటి నగరాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ ప్రజల కష్టాలు చూడలేని వారు రాయి కంటే కఠినాత్ములని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర 'మనల్ని' క్షమించబోదని అన్నారు. మూసీ పరీవాహక ప్రజాప్రతినిధులు నదీ ప్రక్షాళన చెయ్యాల్సిందే అని రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మట్లు భట్టి విక్రమార్క, ఎంపి వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు ప్రకాష్ గౌడ్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాలె యాదయ్య, నవీన్ కుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, డిజిపి శివధర్ రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎం.డి. ఈ.వి.నర్సింహ్మా రెడ్డి, జాయింట్ డైరక్టర్ గౌతమి, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## శాసనసభ్యుల క్రీడా సంబరం..

ఎల్‌బి స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం

ప్రజాప్రతినిధుల్లో ఉత్సాహం నింపేందుకే ఈ క్రీడలు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభ్యుల పని ఒత్తిడిని తగ్గించి, వారిలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు రూపొందిచిన 'తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్2026' హైదరాబాద్‌లోని ఎల్‌బిస్టేడియంలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి, బిలూన్లను గాల్లోకి ఎగురవేసి ఈ క్రీడా ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ . నిత్యం రాజకీయాల్లో నిమగ్నమై సమస్యల పరిష్కారానికి శ్రమించే వారికి క్రీడలు ఒక ఉత్తమ విరామమని ఆయన పేర్కొన్నారు.ఈ వేదికపై క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడానికి ఇది మంచి అవకాశం అని సిఎం అన్నారు. ఈ మైదానంలో క్రీడా శిక్షణ పొందిన పలువురు నేడు మంత్రివర్గంలో ఉన్నారని గుర్తు చేశారు. క్రికెట్‌లో దేశానికి కీర్తి తీసుకొచ్చిన మహ్మద్ అజాహరుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారని, రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు క్రీడలకు మంచి ప్రాధాన్యత ఉండేదని, కానీ తరువాత అది తగ్గిందని సిఎం విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చామని, గ్రామీణ స్థాయిలో ప్రతిభను వెలికి తీయడానికి సిఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు.140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో తగిన ఫలితాలు సాధించలేకపోతుండగా, తక్కువ జనాభా ఉన్న సౌత్ కోరియా 32 గోల్డ్ మెడల్స్ సాధించడం ప్రస్తావించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చిన సిఎం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చామని చెప్పారు. దీనిపై ప్రతిపక్షాలు అనవసర వివాదాలు సృష్టించాయని విమర్శించారు. ఫామ్‌హౌస్ పార్టీలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా క్రీడలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఎల్‌బిస్టేడియాన్నిఅంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని, అలాగే గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ స్థాయి క్రీడా పోటీలకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. బేగంపేట హాకీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారని గుర్తుచేసిన సిఎం, మళ్లీ ఆ స్థాయికి క్రీడా స్ఫూర్తిని తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు.

## పిల్లలు గొంతు నులిమి తాను ఉరేసుకొని...



**ప్రజాపక్షం/కంది :** కంది మండల పరిధిలోని జుల్కల్ గ్రామంలో ఒక మహిళా ,ఆమె ఇద్దరు చిన్నారులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. మక్తల్ గ్రామానికి చెందిన బీర్ల శంకర్(50) ఇచ్చిన పిర్యాదు ప్రకారం ,తన రెండవ కూతురు మమత (27)ను 2017 లో జుల్కల్ గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్‌కు వివాహం చేశారు. వీరికి మణికంఠ (5) ప్రణయశ్రీ,(2) అనే ఇద్దరు పిల్లలు, ఉన్నారు. 05.01.2026 పట్నం ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మమత మానసికంగా కృంగిపోయి ఉందని తెలిపారు. శనివారం ఉదయం సుమారు 12.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి తలపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి మధ్యాహ్నం సుమారు, 1.00 గంటలకు తలుపులు బలవంతంగా తెరచి చూడగా మమత ఇంటి దూలానికి చీరతో ఉరి వేసుకొని మృతి చెందన స్థితిలో కనిపించింది. పక్కనే నేలపై ఆమె ఇద్దరు పిల్లలు మృతదేహాలుగా కనిపించారు. పరిశీలించగా పిల్లల గొంతు బాగంలో గాయాలు ఉన్నట్లు గమనించారు. ప్రాథమికంగా భర్త మరణం వల్ల కలిగిన మానసిక బాధతో మమత తన పిల్లలను గొంతు నులిమి చంపి అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. అయితే అసలు మరణ కారణాలపై స్పష్టత కోసం దర్యాప్తు కొనసాగుతొంది. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ,డీఎస్పీ సత్తయ్య గౌడ్, ప సంఘటన స్థలానికి చేరుకొని మృతిదేహాలను పోస్టు మార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .




## 'పోలీసు అక్క'కు స్కోచ్ అవార్డు

ఎస్‌పి జానకీ షర్మిలకు సిఎం అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల భద్రతను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నిర్మల్ జిల్లాలో ఎస్‌పి జానకీ షర్మిల చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును నిర్మల్ ఎస్‌పి జానకీషర్మిల అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 7 వేల మంది విద్యార్థినులు, మహిళలకు భద్రత, ఆత్మరక్షణ, సమస్యలను ఎదుర్కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ప్రశంసనీయమని సిఎం పేర్కొన్నారు. పోలీసు అక్క కార్యక్రమం కింద మహిళా పోలీసు అధికారులు అక్కలుగా మారి బాలికలు, మహిళలకు మార్గనిర్దేశం చేస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం విశేషమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర పోలీసు వ్యవస్థకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. మహిళల భద్రతకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని సిఎం ఆకాంక్షించారు.

## పేదల జీవితాలు నాశనం చేయడాన్ని అడ్డుకోవాలి

కెటిఆర్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అవినీతి, కుంభకోణాలను ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నిస్తే కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణిని ప్రదర్శించారని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బెదిరింపులు అలవాటైపోయిందని, అలాంటి బెదిరింపులకు బిఆర్‌ఎస్ ఎప్పటికీ భయపడబోదన్నారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని, అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను అనవసరంగా పెంచి, అవినీతికి మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు.

## బిల్లులపై ఇంత నిర్లక్ష్యమా

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉన్నాయని, పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో శనివారం ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యత రహితంగా వ్యవహరించి డిమాండ్ బుక్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రణ చేశారని అన్నారు. ఆర్థిక మంత్రి , సొంత ఆర్థిక కారణాలపై బిజిగా ఉన్నట్లు అనిపిస్తుందనీ, తప్పును సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు అవుట్ కమ్ బడ్జెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్ కూడా ఒకేలా ఉన్నాయనీ, గతంలో సాధించిన పలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారా, సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదని చమత్కరించారు. ఇది పొరపాటు కాదు నేరమే అవుతుందని, సభలో ఇదే విషయంపై చర్చిస్తానని జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎల్‌పిజి కొరతతో ఇబ్బందుల్లో ఆటో డ్రైవర్లు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

నిరసన వ్యక్తం చేసిన ఆటో డ్రైవర్లు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో గత కొంతకాలంగా వేధిస్తున్న ఆటో ఎల్‌పిజి కొరతపై ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఈ కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం మాట్లాడుతూ ఎల్‌పిజి కొరత కారణంగా డ్రైవర్లు ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పని గంటలు తగ్గిపోవడంతో రోజువారీ సంపాదన లేక డ్రైవర్ల కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి గ్యాస్ లభించకపోవడంతో పాఠశాల విద్యార్థులను చేరవేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇంధనం అసలు ధర కంటే కిలోగ్రాముకు అదనంగా రూ. 30 వసూలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఇంధన కొరత లేదని చెబుతున్న ప్రధాని మోదీ, మరి ఆటో డ్రైవర్లకు డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లై ఎందుకు చేయడం లేదని వెంకటేశం ప్రశ్నించారు. ఇంధన కొరత ఇలాగే కొనసాగితే వేలాది మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్. బోస్, యూనియన్ నాయకులు సి.హెచ్. జంగయ్య, ఎస్. అశోక్, శ్రీనివాస్, మురళి, మల్లేష్ గౌడ్, లతీఫ్, ఎం. నర్సింహ, ఎం.డి. జాకీర్, మల్లికార్జున్, ఎం. కృష్ణ, ప్రభు పాల్గొన్నారు.




విజయవాడలో జరుగుతున్న ఐజెయు 11వ ప్లీనరీలో మహిళా జర్నలిస్టులతో యూనియన్ అగ్రనేతలు

## పలు పద్దులకు శాసనసభ ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ పలువురు పలు పద్దులను ఆమోదించింది. శనివారం శాసనసభలో విత్త ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, విత్త పాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాల క్రింద రూ. 22,310,01.75 లక్షలు, ఇంధనం పద్దు క్రింద రూ.15,748,28,80 లక్షలతో ప్రతిపాదించిన పద్దులను శాసనసభ ఆమోద ముద్ర వేసింది. అదేవిధంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపాదించిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.1,969,51.76 లక్షలు గృహ నిర్మాణం క్రింద రూ. 7,219,61,98 లక్షలు , సమాచార ,పౌర సంబంధాల క్రింద రూ. 526,38.28 లక్షలతో కూడిన పద్దులను చర్చ అనంతరం సభ ఆమోద ముద్ర వేసింది. సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్లు, పరిశ్రమలు వాణిజ్య శా ఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించిన పరిశ్రమలు, వాణిజ్యం రూ.2,411,38.13 లక్షలు, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ,కమ్యూనికేషన్ల క్రింద రూ. 874,81.20 లక్షలు, శాసన మండలి పద్దు క్రింద రూ. 253,46.32 లక్షలు పద్దులకు ఆమోదం తెలిపింది.

## బిఆర్‌ఎస్ హయాంలో సిరిసిల్ల నేరెళ్ల ఘటనపై చర్యలేవి?

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ప్రభుత్వం హాయంలో సిరిసిల్ల నేరెళ్ల గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన చిన్న పాపను ఇసుక మాపియాకు చెందిన ఇసుక లారీ కిందపడి చనిపోతే ఆ లారీలకు అడ్డుకున్న యువకులపై అక్రమ కేసులు బనాయించి వారం రోజులు నరక యాతన గురిచేసిన ఘటనపై నాడు సభా కమిటీ ఎందుకు వేయలేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. ఇప్పటి ఉప ముఖ్యమంత్రి అప్పటీ కాంగ్రెస్ శాసనసభ పక్ష నాయకులు మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోకలిసి తను బాధితులను వెళ్లి కలిస్తే పోలీసులు దెబ్బలు తాళలేకపోతున్నామన్నా, కాస్త విషమిచ్చి వెళ్ళు అన్నా అని వేడుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఆ లారీ యజమానులపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు ఎలాంటి అక్రమాలు జరకపోయినా మంత్రి నివ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



## ఎంఎంసి కమిషనర్ బాక్స్ డ్రైన్ పనులు తనిఖీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విధి నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వినయ్‌కృష్ణారెడ్డి కాప్రా సర్కిల్‌లోని కుషాయిగూడ డీమార్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న బాక్స్ డ్రైనేజీ పనులు, కందిగూడలోని పార్కు, ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఇఇ రమేష్ బాబు, డిఇ బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమూర్తి, ఎలక్ట్రికల్, శానిటేషన్, డిఇలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్‌లో 81,078 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయి గూడలోని మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా న్యాయాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, బ్యాంకు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 25 బెంచుల్లో 39 సివిల్, 81వేల ఏడు క్రిమినల్ కేసులు పరిష్కరించారు. 32 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించి 34 లక్షల 54 వేల 988 రూపాయలు పరిహారం కింద చెల్లించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రెటరీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.తిరుపతి, బార్ అసోసియేషన్, పోలీసు, బ్యాంకు, బిఎస్ఎల్ఎన్ సిబ్బంది, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలోని బోర్ మోటార్‌కు సొంత ఖర్చుతో మరమ్మతులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్మశాన వాటికలో గత కొన్ని రోజులుగా బోర్ మోటర్ పనిచేయకపోవడంతో జిహెచ్‌ఎంసి అధికారులకు ఎన్నో సార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని నాయకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని 5వ డివిజన్ నాగారం శ్మశాన వాటికలో గత కొన్ని రోజులుగా బోర్ మోటర్ పాడైపోవడంతో శ్మశాన వాటికకు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలుసుకున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, బిజెపి నాయకులు బోరును పరిశీలించి తమ సొంత ఖర్చుతో మోటర్‌కు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 38,097 కేసులు రాజీ : న్యాయమూర్తి చంద్రకిశోర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా 38,097 కేసులు రాజీపడ్డారు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రకిశోర్ తెలిపారు. వికారాబాద్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి చంద్రకిషోర్ పాల్గొని మాట్లాడుతూ రాజీ పడటానికి లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో రాజీపడ్డదగ్గ కేసులు, అన్నదమ్ముల మధ్య తగాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, మోటార్ వెహికిల్ ప్రమాదాలు కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగకుండా రెండు వర్గాలు కుర్చుని మాట్లాడుకొని కేసులను తొలగించుకోవాలని సూచించారు. జాతీయ న్యాయసేవా చట్టం 1987 తీసుకురావడం జరిగిందన్నారు. మన జిల్లా కోర్టు ఆవరణ మీడియేషన్ ద్వారా వెళ్లినట్లు అయితే మన మీడియటర్స్ ఇరు పార్టీలను కుర్చోబెట్టి వారికి అర్థమయ్యే విధంగా వారికి కౌన్సిలింగ్ ఇస్తారు. ఇరు పార్టీలు రాజీపడే విధంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ వెంకటేశ్వర్లు, శాంతిదూత, వైష్ణవి, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ నిర్మూలిద్దాం... యువతను కాపాడుకుందాం

**ప్రజాపక్షం/వికారాబాద్:** శనివారం నుండి ఐపిఎల్ ప్రారంభం అయింది. కాబట్టి ఎంతోమంది యువకులు దీనికోసం ఎదురు చూస్తు ఉంటారు. ఐపిఎల్ ని కేవలం ఆటగా మాత్రమే చూసి ఎంజాయ్ చేయాలి.. అలా కాకుండా సులభంగా డబ్బులు సంపాధించాలనే ఉద్దేశంతో అక్రమమైన మార్గాలు వెతుకుతూ బెట్టింగ్‌కు పాల్పడి డబ్బులు కోల్పోయాక నేరాల వైపు చూస్తునట్లు తెలుస్తుంది. చిన్నగా ప్రారంభమై ఈ బెట్టింగ్‌తో డబ్బులు కోల్పోయాక కుటుంబంలో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి గురై సూసైడ్ చేసుకునే దాకా వెళుతుంది. కాబట్టి తల్లిదండ్రులు ముఖ్యంగా మీ పిల్లలు ఆన్‌లైన్‌లో క్రికెట్ చూస్తున్నా, బెట్టింగ్ యాప్స్ డౌన్లోడ్ చేసుకున్న మీరు గమనిస్తు ఉండాలి అని సూచించారు. ఎవరైనా బెట్టింగ్ పాల్పడినట్లు మీకు సమాచారం ఉంటే 8712670030కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లయితే వాళ్లపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నాని సిఐ. రఘుకుమార్ తెలిపారు.

# ఆదిలోనే అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంజూరైన ప్లాన్‌లకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలపై ప్రారంభంలోనే చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉప్పల్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్‌లో శనివారం ఆయన పర్యటించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఏ.ఎస్. రావు నగర్ డివిజన్, అనుపురం కాలనీ, కందిగూడ, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటించి, అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయ్యాక చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, ప్రారంభ దశలోనే అక్రమాలను గుర్తించి నిలిపివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుపురం కాలనీలో పర్యటించిన సమయంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన శిథిలా లు, వేలాడుతున్న కేబుల్ వైర్ల పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. వీటిని వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఏలు, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, లేనిపక్షంలో భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

**క్రీడా మైదానం, పార్కు పనుల పరిశీలన..**

కందిగూడలోని ఓయూటి కాలనీలో నిర్మిస్తున్న మినీ ఫుట్‌బాల్ స్టేడియం, స్థానిక పార్కు పనులను కమిషనర్ పరిశీలించారు. యువతకు ఉపయోగపడేలా ఈ స్టేడియం పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పార్కు పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.

**వర్షాకాలం లోపే డ్రైనేజీ పనులు పూర్తి**

కుషాయిగూడ డీమార్ట్ సమీపంలో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించిన కమిషనర్, రాబోయే వర్షాకాలం లోపే వీటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల వల్ల వాహనదారులకు, పాదచారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే







**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి సంవత్సరం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోలిస్ ఐ హస్పిటల్,తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నందనం పాటి రాముల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలను రాధిక చౌరస్తా, ఇసీఐఎల్ చౌరస్తాలో ఎమ్మెల్యే ప్రారంభించారు. పాదచారుల దాహర్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి రోజున మజ్జిగ చలి వేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సిఐ భాస్కర్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ రుద్రవీర్ కుమార్, ఎస్ఐ సాయిలు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ రామనుజ ట్రస్టు ఆధ్వర్యంలో**

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శ్రీ రామనూజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధనుంజయ నర్సింగ్ హోం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ట్రస్టు చైర్మన్ డాక్టర్ ధనంజయ, వైస్ చైర్మన్ డాక్టర్ కౌశల్ వర్ధన్‌లతో కలసి ప్రారంభించారు.అనంతరం లివరుకు సంబంధించిన వేల రూపాయల ఖరీదైన ఫెబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జి శ్రీనివాస్‌రెడ్డి,ప్రభుదాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీర హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్‌ను శనివారం శ్రీ పాత ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల విలేజ్‌లో గల శ్రీ పాత ఆంజనేయ స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం నిర్వహించే శ్రీ వీర హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కూన శ్రీనివాస్‌గౌడ్‌ను ఆహ్వానించారు.
ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు శేఖర్, కళ్యాణ్, సాయి, సందీప్, జంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బలప్ప తదితరులు పాల్గొన్నారు.

## ధాన్య సేకరణలో లక్ష్యాలను అధిగమించాలి

### అదనపు కలెక్టర్ రాజేశ్వరి



**ప్రజాపక్షం/వికారాబాద్:** రబీ సీజన్‌కు సంబంధించిన వారి ధాన్య సేకరణలో లక్ష్యాలను అధికమించాలని జిల్లా అదనపుకలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు.

అదనపు కలెక్టర్ రబీ సిజన్‌కు సంబంధించి వరి ధాన్యం సేకరణ కై సంబందించి వరి ధాన్యం సేకరణరకై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 వరి ధాన్య సేకరణ లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధింత అధికారులు సందర్శించి మౌలిక సాధుపాలయలు కల్పించాలని ,సమన్వయంతో పని చేసి వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలాఅన్ని చర్యలు చేపట్టాలని అమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాములు నాయక్ , పౌరసరఫరాల అధికారి సుదర్శన్ , మోహన్ తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా జస్వంత్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** గొట్టిముక్కల జస్వంత్ రావు (దేశల్) జన్మదిన వేడుకలు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందలపు సాయిబాబా చౌదరి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, కాజా నవీన్, రామ్ చౌదరి తదితరులు దేశల్‌ని కలిసి శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుల, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## రామాయణం నాటక ప్రదర్శన



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో శ్రీ రామనవమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సంపూర్ణ రామాయణం నాటకాన్ని ప్రదర్శించారు.రాముడుగా జనార్ధన్,సీతగా లక్ష్మి నారాయణ,రావణుడుగా వెంకట్‌రావు,లక్ష్మణుడుగా ప్రకాష్,శూర్పణఖగా రవిలు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా టిడిపి సీనియర్ నాయకులు,చర్లపల్లి కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్,సీనియర్ నాయకులు కొండ జంగారెడ్డిలు హజరై వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** పదవ పరీక్షలను సజావుగా నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. శనివారం పదవ తరగతిపరీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్షనిర్వహణ తీరు ను పరిశీలించారు అనంతరం చీప్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డ్యూటీ రిజిస్టర్, ప్రశ్న పత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హజరు శాతం అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీసి అక్కడ ఉన్న మందులను పరీశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు ముందులను అందుబాటులో ఉంచాలనికలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సిఎంఆర్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/మర్పల్లి:** కళ్యాణలక్ష్మి ,షాదీముబరక్ సిఎంరా చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేస్ యాదవ్ , మార్కెట్ కమిటి చైర్మన్ మహేందర్‌రెడ్డి ,శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కళ్యణ లక్ష్మి షాధిముబరక్‌కు సంబంధించిన 76 చెక్కులు సిఎంఆర్ కు సంబందించిన చెక్కులు 36 సర్పంచు రామేశ్వరతో కలిసి అందజేశారు. ఈ సదర్భంగావారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహయం కుటుంబ అవసరలకోసం ఉపయోగించుకోవాలని సూచించారు.స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకరంతో గ్రామల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రవీందర్ , రఫీ ,పరుశురాం , నగేష్ .జగదీస్,భరత్ తదితరులు పాల్గోన్నారు.



## లింగంపల్లి, రామచంద్రపురం రైల్వే స్టేషన్ల తనిఖీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణీకుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించిన జోన్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం సికింద్రాబాద్ డివిజన్‌లోని లింగంపల్లి రామచంద్రపురం రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్‌తో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. లింగంపల్లి స్టేషన్‌లో జిఎం వెయిటింగ్ హాల్, టికెటింగ్ సదుపాయాలు, లిఫ్టులు, ప్లాట్‌ఫారాలు వంటి ప్రయాణీకుల సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ పరిశుభ్రత, ప్రాంగణ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అదేవిధంగా ట్రాక్‌ల పరిస్థితి, రైలు నిర్వహణ సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్ అభివృద్ధి, విస్తరణ ప్రణాళికలపై డివిజనల్ అధికారులు జీఎంకు వివరాలు అందించారు. రైల్వే సేవల సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగింది. అనంతరం రామచంద్రపురం రైల్వే స్టేషన్‌ను సందర్శించిన జిఎం, అక్కడి ప్రయాణీకుల సౌకర్యాలు మరియు మౌలిక వసతులను పరిశీలించారు. భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, జోన్ వ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల సౌకర్యాల పెంపు, భద్రతా ప్రమాణాల మెరుగుదలపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్కు రద్దుకోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన రైతులు

**ప్రజాపక్షం/పరిగి:** వికారాబాద్ జిల్లా పరిధిలోని, పరగి మండలంలోని కాడ్లపూర్ గ్రామ పరధిలో ఇండస్ట్రియల్ పార్క్ రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి శనివారం గ్రామస్తులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. మా గ్రామ పరిధిలో పట్టాభూమి 159.25 ఎకరాలు, ఆసైన్డ్ భూమి 428.05 ఎకరాలు మొత్తం 578.30 ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్క్ కొరకు జారీ చేసిన నోటిఫికేషన్ మమ్మల్ని ఆందోళనకు గురిచేస్తుందని, మా భూములు ఆస్తులు మాత్రమే కాదు తరాల నుండి వస్తున్న మా జీవనాధారం. మేము పంటలు పండించుకొని బ్రతకడం మా భూములు సారవంతమైన భూములని సంవత్సర కాలంలో రెండు పంటలు, మూడు పంటలు పండించుకుంటామని మా భూములనే ఆధారంగా నమ్ముకుని బ్రతుకుతున్నామని భూములు కోల్పోతే భవిష్యత్తులో మా పిల్లలకు జీవనోపాధి లేదని , మా గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని మా గ్రామ రైతులకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకుంటారని గ్రామస్తులు కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు.

## జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌కు స్థలం ఏర్పాటుకు వినతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్ లో జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ కు స్థలం ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు బౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. వెంటనే ఎమ్మెల్సీ స్పందించి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వ భూమిలో స్థలం ఏర్పాటుకు సహకరించాలని కోరుతున్న సిఫాసు లేఖను మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అందజేసిన బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.



## క్త్తొ లెవల్‌తో డ్రైనేజీ పనులు పునఃప్రారంభం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం సర్కిల్ పరిధిలోని భవాని నగర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో లెవెల్ లోపాలు బయటపడటంతో ఇప్పటికే వేసిన పైప్‌లైన్‌ను తొలగించి, కొత్త లెవెల్ ప్రకారం మళ్లీ పనులు ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైప్‌లైన్ సరైన లెవెల్‌లో లేకపోవడం వల్ల మురుగునీరు రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని గుర్తించారు. దీంతో రోడ్ నెంబర్ 3లో సుమారు 100 మీటర్ల మేర ఇప్పటికే వేసిన పైప్‌లైన్‌ను తొలగించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణం గా తిరిగి అమర్చించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నతండ్రిని గొడ్డలితో నరికి చంపిన కుమారుడు

### నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలింపు

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధి బాయిమీదితాండలో దారుణం జరిగింది. మద్యం మత్తులో తల్లి, చెల్లిని వేధిస్తున్నాడన్న ఆవేశంతో ఓ కుమారుడు కన్నతండ్రిని గొడ్డలితో నరికి చంపిన ఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం జరిగిన ఘటన వివరాలను తాండూరు రూరల్ సిఐ మీడియాకు వివరించారు. పెద్దేముల్ మండల పరిధిలోని బాయి మీది తాండకు చెందిన రాథోడ్ లోక్యనాయక్(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసై భార్య బిక్కిబాయిని, చిన్న కుమార్తెను మద్యం సేవించి వేధించేవాడని తెలిపారు. ఈ క్రమంలో మార్చి 27న ఉదయం కూడా లోక్యనాయక్ భార్య, కూతురిని వేధించడంతో పాటు దాడి చేశారని, ఈ వేధింపులు భరించలేని భార్య బిక్కిబాయి హైదరాబాద్‌లో ఉండే తన కుమారుడి రాథోడ్ సునీల్ నాయక్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసినట్లు తెలిపారు. తల్లి ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న కుమారుడు సునీల్ నాయక్ హుటాహుటిని హైదరాబాద్ నుండి తాండకు చేరుకున్నాడు. సునీల్ నాయక్ తండ్రి ప్రవర్తనపై నిలదీయడంతో తండ్రి కొడుకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆవేశంతో పక్కనే ఉన్న కట్టెలు నరికే గొడ్డలిని తీసుకుని తండ్రి మెడ, దవడ, తల వెనుకభాగంలో నరికి దారుణ హత్య చేశాడని తెలిపారు. హత్య సమాచారం అందుకున్న పెద్దేముల్ పోలీసులు వెంటనే రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోలీసులతో కలసి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి నిందితుడు సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## నిర్ధవెల్లి పాఠశాలలో నూతన ఫిల్టర్ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనూతన ఫిల్టర్ వాటర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. శనివారం నిర్ధవెల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ ఫిల్టర్‌ను చలసాని ప్రతీక, హన్సీక తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని, ఈ విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పాఠశాల విద్యార్థులు ఈ సౌకర్యం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సపుర అమేర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు చంద్రయ్య, చెన్నయ్య, మోహిజ్‌ఖాన్, జంగేష్, విజయ్, మధు, జంగయ్య, ఖాజాపాషా, దిద్దెల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## అనంత పద్మనాభ స్వామి రాజగోపుర నిర్మాణానికి శ్రీకారం



**ప్రజాపక్షం/కొత్తూరు:** స్వయంభు శ్రీ అనంత పద్మనాభ స్వామి రాజగోపుర నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ బెజవాడ అనితరెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న రాజగోపురం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మామిడి శ్యాం సుందర్‌రెడ్డి, సిడి తండా సర్పంచ్ గబ్రు చౌహాన్, పెంజర్ల సర్పంచ్ జగన్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయంభుగా వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. దాతల సహకారంతో మున్ముందు మరింత అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, మామిడి విక్రంరెడ్డి, సిద్దార్థలతోపాటు మాజీ సర్పంచ్ వనం బాల్‌రాజ్, మాజీ ఆలయ కమిటి చైర్మన్ మోహన్‌రెడ్డి, టీచర్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచులు శంతన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఈ అవకాశాలను ప్రజలందరు ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు తగిన మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల అనేక రకాల కొత్త వ్యాధులు వస్తున్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. క్షయవ్యాధి నియంత్రణకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. 99రోజుల ప్రణాళికలో భాగంగానే చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేక వైద్యులు వచ్చారని, వారితోనే ప్రజలకు వైద్యపరీక్షలు చేయించినట్లు పేర్కొన్నారు. రక్త పరీక్షలతోపాటు మూత్ర పరీక్షలు, ఎక్స్‌రేలు తీశారు. ఈ కార్యక్రమంలో చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి,డాక్టర్‌ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. శనివారం పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి పంక్షన్ హాల్‌లో మాంటిసోరి గ్రూప్ ఆఫ్ స్కూల్ 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి షాద్‌నగక్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు అగ్గనూరు విశాల విశ్వం, చాకలి పెంటయ్య, మురళీమోహన్ అప్పిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగానే నేర్చుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. తరగతి గది నుండే విద్యార్థుల భవిష్యత్ నిర్ధేశించడం జరుగుతుందని, కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరే అవకాశం ఉంటుందన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో మాంటిసోరి స్కూల్ గ్రూప్ సిఇఓ జార్ట్ థామస్, వైస్ ప్రిన్సిపాల్ బిలుజార్జ్, ప్రిన్సిపాల్ రంజిత్, పాఠశాల డైరెక్టర్ రమేష్ కుమార్ తదివతరులు పాల్గొన్నారు.



# సైబరాబాద్‌లో 'క్లీన్ స్వీప్ డ్రైవ్' విజయవంతం

### 953 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు
### సిఎంసి కమిషనర్ సృజన





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) నగరాన్ని సుందరంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన 'సైబరాబాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్' విజయవంతమైందని కమిషనర్ సృజన తెలిపారు. శనివారం తెల్లవారుజామున 6 గంటల నుంచే ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా పటాన్‌చెరు నుండి మణికొండ వరకు ఉన్న ప్రధాన రహదారులు కొత్త రూపును సంతరించుకున్నాయి. గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సిఎంసి కమిషనర్ సృజనతో కలిసి ఈ డ్రైవ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 22 కిలోమీటర్ల మేర సాగిన ఈ పారిశుద్ధ్య డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఈ మార్గాన్ని 44 విభాగాలుగా విభజించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 128 మంది అధికారులు, 716 మంది పారిశుద్ధ్య కార్మికులు శ్రమించారు. పటాన్‌చెరు నుంచి మొదలై బిహెచ్‌ఈఎల్, నల్లగండ్ల ఫ్లైఓవర్, గచ్చిబౌలి, మల్కం చెరువు, కాజాగూడ జంక్షన్, లాంకో హిల్స్ మీదుగా మణికొండ వరకు పనులు కొనసాగాయి. ప్రతి 500 మీటర్ల విభాగానికి 15 మంది కార్మికులతో పాటు ప్రత్యేక వాహనాలను కేటాయించి, సత్వరమే వ్యర్థాలను తొలగించారు.

**ఒక్కరోజే 953 మెట్రిక్ టన్నుల వ్యర్థాల సేకరణ**

| | |
|---|---|
| భవన నిర్మాణ వ్యర్థాలు | : 455 మెట్రిక్ టన్నులు |
| పచ్చటి వ్యర్థాలు | : 227 మెట్రిక్ టన్నులు |
| పేరుకుపోయిన పూడిక | : 142 మెట్రిక్ టన్నులు |
| చెత్త | : 129 మెట్రిక్ టన్నులు |

**కేవలం శుభ్రతే కాదు.. అభివృద్ధి కూడా..**

పారిశుద్ధ్యంతో పాటు మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా అధికారులు దృష్టి సారించారు. 65 వీధి దీపాలను మార్చడంతో పాటు, 25 చోట్ల ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్‌లను సరిచేశారు. ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ఉన్న 186 అక్రమ ఆక్రమణలను తొలగించి బాటసారులకు ఇబ్బంది లేకుండా చేశారు. డివైడర్‌లకు రంగులు వేయడం, మొక్కల కత్తిరింపు, కొత్త ప్లాంటేషన్ పనులు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులను అన్ని విభాగాలు సమన్వయంతో పూర్తి చేశారు. శుభ్రమైన, సుస్థిరమైన సైబరాబాద్ నిర్మాణం కోసం సిఎంసి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని కమిషనర్ సృజన తెలిపారు. రోడ్ల పరిస్థితి మెరుగుపడటం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారని చెప్పారు.

## క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే పిడి యాక్ట్

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా
- వేధింపులకు పాల్పడితే డయల్ 100కు ఫిర్యాదు చేయండి: సిపి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐపిఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు మాత్రమే కాకుండా, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, ఇతర రహస్య స్థావరాల్లో గుంపులుగా చేరి ఫోన్ల ద్వారా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు. స్థానిక బుకీలు యువతను అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ప్రయోగించడానికైనా సిద్ధమేనని చెప్పారు. క్రికెట్‌ను జూదంగా మార్చి అమాయకుల జీవితాలతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. గతంలో చేపట్టిన 'సే నో టు బెట్టింగ్ యాప్స్' ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన మద్దతు లభించిందని, తద్వారా కేంద్ర ప్రభుత్వం వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించడమే కాకుండా కఠినమైన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును కూడా తీసుకువస్తోందని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఈ వంచన కొత్త రూపం దాల్చిందని, యాప్‌లు పోయినా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త వెబ్‌సైట్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

**బెట్టింగ్‌లో గెలిచేది కేవలం నిర్వాహకులు మాత్రమే..**

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ చివరికి కన్నీళ్లే మిగిలిస్తుందని, బెట్టింగ్‌లో గెలిచేది కేవలం నిర్వాహకులు మాత్రమేనని, ఆడేవారు సర్వస్వం కోల్పోతారని హెచ్చరించారు. ఒక్కసారి ఈ వ్యసనానికి బానిసలైతే కుటుంబాలు రోడ్డున పడతాయని, క్రికెట్‌ను ఒక క్రీడగా ఆస్వాదించాలి తప్ప జూదంగా మార్చుకోవద్దని హితవు పలికారు. నగరాన్ని, యువతను ఈ బెట్టింగ్ భూతం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా మిమ్మల్ని వేధిస్తున్నా వెంటనే డయల్ 100, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555 కు గానీ సమాచారం అందించాలని సిపి కోరారు.

## 103 క్రికెట్ క్లబ్బులు గల్లంతు

### నివేదించిన జస్టిస్ ఎన్‌వి కాక్రు కమిటి
### వెల్లడించిన టిసిఎ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రికెట్ రంగంలో సంచలనం రేపే ఆరోపణలతో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు గుప్పించింది. రూ.69 కోట్ల విశాఖా ఒప్పందం దోపిడి నుంచి హెచ్‌సిఎ క్లబ్బుల అక్రమ ప్రైవేటీకరణ వరకు పలు కీలక అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని శనివారం టిసిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దారం గురువారెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ ఒప్పందం వల్ల జరిగిన భారీ ఆర్థిక నష్టంపై ఇప్పటికీ రికవరీ చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇదే సమయంలో, జిహెచ్‌ఎంసికి చెందిన 17 క్రికెట్ క్లబ్బులు అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు ఆరోపించింది. అదేవిధంగా, 80 అక్రమ ప్రైవేట్ క్లబ్బులు, అలాగే గతం లో ఉన్న 103 క్లబ్బులు గల్లంతవడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. తాము చేసే ఈ ఆరోపణలతో పాటు హెచ్‌సిఎ వ్యవహారాలపై పర్యవేక్షణ కోసం నియమించిన జస్టిస్ ఎన్.ఎ. కాక్రు కమిటీ నివేదికలో సభ్యత్వ వ్యవస్థలో భారీ అవకతవకలు బయటపడినట్లు తెలిపింది. 2015 రిజిస్టర్‌లో అకస్మాత్తుగా 80 కొత్త క్లబ్బులు చేర్చడం ఎన్నికల మానిప్యులేషన్‌కు నిదర్శనమని ఆరోపించింది. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు కూడా హెచ్‌సిఎ మాస్టర్ రిజిస్టర్‌ను పెద్ద మోసంగా పేర్కొన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి సం స్కరణలు జరగలేదని ఆయన విమర్శించారు.కేవలం 10 మంది చేతుల్లో 70 క్లబ్బులు ఉండటం, క్లబ్బుల కొనుగోలు–అమ్మకం జరుగుతుండటం, ఒక్క క్లబ్ ధర రూ.1నుంచి2 కోట్ల వరకు ఉండటం వంటి అంశాలు బయటపడినట్లు ఆ యన తెలిపారు. ప్రభుత్వ శాఖలకు చెందిన క్లబ్బులు కూడా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మబడినట్లు ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ టికెట్ల స్కామ్‌పై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంప్లిమెంటరీ టికెట్లు, ప్లేయర్ పాసులు బ్లాక్ మార్కెట్‌లో విక్రయించబడుతున్నాయని, అసలు అభిమానులకు అవి అందడం లేదని పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తే ఉపేక్షించేది లేదు

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దల జంగయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తే ఉపేక్షించేది లేదని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య హెచ్చరించారు. శనివారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అవరణలో ఎఐటియుసి మండల గౌరవ అధ్యక్షుడు జిల్లెల వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.3వేలు ఇస్తూ పని చేయించుకుంటున్నారని, చాలిచాలని వేతనంతో అనేక అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ప్రాథమిక పాఠశాలలో చదువుకునే ఒక్కొక్క విద్యార్థికి రూ.6రూపాయల చొప్పున కేటాయించిందని, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకొక్కరికి రూ.9రూపాయలు కేటాయించబం జరుగుతుందని తెలిపారు. ఇలా తక్కువ రూపాయాలు కేటాయిస్తే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా ఇవ్వాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలనెల బిల్లులు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

**మండల నూతన కార్యవర్గం ఎన్నిక**

జిల్లేడు చౌదరిగూడ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎండి చోటమీయా, ఉపాధ్యక్షులుగా రాధా లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా శేఖర్ గౌడ్, సహయ కార్యదర్శిగా మహేశ్వరీ, రవి, కోశాధికారిగా శివం, ఈశ్వరీ, కమిటి సభ్యులుగా మరో 10మందిని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఏఐటియుసి నాయకుడు ఎండి షబ్బీర్, వీరేశంలు పాల్గొన్నారు.

## కెవిఆర్‌ను అరెస్టు చేసే హక్కు ఎపి పోలీసులకెక్కడిది?

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల నిలదీత




**ప్రజాపక్షం / సోమాజిగూడ :** తెలంగాణ జర్నలిస్టును అరెస్టు చేసే హక్కు ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఎవరిచ్చారనిపలువురు వక్తలు ప్రశ్నించారు. జర్నలిస్టు కెవిఆర్ అరెస్టు అప్రజాస్వామికమని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో 'ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం' అనే అంశంపై కన్వీనర్ కరుణాకర్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ఎపి సిఎంను దేవుడితో పోల్చుతూ ఓ టీవీ చానెల్‌లో ప్రసారమైన వార్తను ఉటంకిస్తూ ఒక మనిషిని దేవుడితో పోల్చవద్దని, చంద్రబాబు మానవమాతృడని చెప్పారని, ఆ మాట అన్నందుకే కెవిఆర్‌ను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రస్తుతం నదులు, నిధులు, నియామకాలన్నీ ఎపికే పోతున్నాయని విమర్శించారు. ఇలాంటి సమయంలో మౌనంగా ఉండొద్దని, ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదన్నారు. సినీ దర్శకులు, సామాజిక కార్యకర్త సయ్యద్ రఫీ మాట్లాడుతూ నిజాలు వెలుగులోకి తెస్తున్న యూట్యూబ్ చానళ్లను అరికట్టాలన్న కుట్రలను చేస్తున్నారన్నారు. ఎపి పోలీసులు తెలంగాణ జర్నలిస్టును అరెస్టు చేస్తే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కరుణాకర్ మాట్లాడుతూ కెవిఆర్‌కు ప్రతి తెలంగాణ జర్నలి స్టు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టు కెవి రెడ్డి మాట్లాడుతూ ఎపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను కెవిఆర్ టీవీ చానెల్ ద్వారా ఎండగట్టినందుకు తనను ఎపి పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. తన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడానికి ఎపి పోలీసులకు ఎలాంటి హక్కు లేదన్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు పల్లె రవికుమార్, మామి డి సోమయ్య, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షులు పృథ్వీరాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలలో మాత్రమే పెట్రోల్, డీజిల్

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పెట్రోల్ బంకుల నిర్వాహకులు వాహనాలలో మాత్రమే పెట్రోల్, డీజిల్ వేయాలని, క్యాన్స్‌లో, బాటిల్స్‌లో వేయరాదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరం జిల్లా సివిల్ సప్లై అధికారులు,గ్యాస్ ఏజెన్సీలు,పెట్రోల్ బంకుల నిర్వాహకులతో గ్యాస్ పెట్రోల్, డీజిల్ సరఫరా,వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజలు అనవసరమైన ఆందోళనకు గురికాకుండా,అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి ఏర్పడుతుందన్నారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కొరత లేదని, ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి కొరత ఉన్నదని సమస్యలు సృష్టించకుండా, అధిక మోతాదులో తీసుకొని ఇండ్లలో నిల్వ చేసుకోవద్దని, దాని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అవసరానికి మాత్రమే తీసుకోవాలని సూచించారు. పెట్రోల్ బంకుల నిర్వహకులు సైతం వాహనాలలో మాత్రమే పెట్రోల్,డీజిల్ పోయాలని, క్యాన్స్, బాటిల్స్‌లో వేయరాదని,ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా స్కూల్, ఆసుపత్రి వంటి ప్రాధాన్యత కలిగిన వాహనాలకు సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కె చంద్రారెడ్డి,జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత,జిల్లా బిసి సంక్షేమ అధికారి బి కేషరామ్,వ్యవసాయ శాఖ అధికారి డి ఉషా,గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు,పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## 31న కొండిగారి రాములు సంతాప సభ

### సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య గౌడ్.. యాచారంలో వాల్ పోస్టర్ అవిష్కరణ....



**ప్రజాపక్షం/యాచారం :** ఇబ్రహింపట్నం మాజీ శాసన సభ్యులు కొండి గారి రాములు సంతాప సభను విజయవంతం చేయాలని సిపిఐరాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్యగౌడ్ కోరారు. శనివారం యాచారం మాండల కేంద్రంలో వాల్ పోస్టరును అవిష్కరించాలరు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ నెల 31 ఇబ్రహింపట్నం మండల కేంద్రంలో సంతాప సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజల గోంతుకగా నిలిచిన మహోన్నత వ్యక్తి కొండిగారి రాములని అయన కొనియాడారు.ఉదయం 11 గంటలకు భారత్ గార్డేన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. కొండిగారి రాములు చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా ప్రజా పక్షపాతిగా నిలిచారన్నారు.అసెంబ్లీలో అనగారిన వర్గాల వారి గోంతుకగా నిలచారన్నారు. నేటి తరానికి అయన ఎంతో అదర్శమన్నారు. సంతాప సభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడం ఎంఎల్‌ఏ కూనం నేని సాంబశివరావు, ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డిరంగారెడ్డి, మాజీ శాసన సభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి,సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమూకుల జంగయ్య, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,హాజరౌతున్నారని తెలిపారు. అందరు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అలిమొద్దిన్,కాటం రాజు గౌడ్, అనంతరెడ్డి,యాచారం మండల కార్యదర్శి సంజీవ తదితరులు పాల్గోన్నారు.

## ప్రతి శాఖలో ఇ – ఆఫీసు ద్వారా కార్యకలాపాలు

### రంగారెడి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి శాఖలో ఇ – ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె చంద్రారెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులకు,సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి పాల్గొన్నారు. జిల్లా అధికారులందరూ ఫైళ్లన్ని ఈఆఫీస్ ద్వారా పంపే విధంగా చర్యలు చేపట్టడానికి ఎన్ఐసి ద్వారా జిల్లా అధికారులకు,శాఖల అధికారులకు సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ ద్వారా అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అధికారులందరూ ఏర్పరుచుకోవాలన్నారు. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉంటాయని అందువలన ప్రతి శాఖలో ఈఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని,శాఖల వారిగా లాగిన్స్ పెండింగులో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల్లలో బల్క్ ఇమెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.ఇప్పటి వరకు ఐడీలు క్రియేట్ కానీ ఎడల త్వరతగతిన ఏర్పాటు చేసుకోని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞాణంలో అధికారులందరూ ట్రైనింగ్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు, ట్రైనింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

• రూరల్ ఇంచార్జ్ ఎస్సై గాయత్రి



**ప్రజాపక్షం/నారాయణపేట:** పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి అక్రమంగా మొరం మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ధన్వాడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌కు చెందిన టిప్పర్ వాహనం అక్రమంగా మొరం మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, నారాయణపేట రూరల్ ఇంచార్జి ఎస్సై గాయత్రి ఆధ్వర్యంలో పోలీసులు అప్పక్‌పల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై గాయత్రి తెలిపారు. అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## నల్లబెల్లం పట్టివేత.. ట్రాక్టర్ సీజ్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సారాయి తయారకు ఉపయోగించే 750 కేజీల నల్ల బెల్లంని ట్రాక్టర్‌తో తరలిస్తుండగా కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు రైడ్ చేసి పట్టుకున్నారు. కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డ తెలిపిన వివరాల ప్రకారం పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల తాండకు చెందిన ఇద్దరు వ్యక్తులు 750 కిలోల నల్లబెల్లాన్ని ట్రాక్టర్ (టిఎస్ 31 2290)లో లింగాలకు తరలిస్తుండగా సమాచారం మేరకు మార్గ మధ్యలో తనిఖీ చేశారు. 750 కేజీల, నల్ల బెల్లం ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో కొల్లాపూర్ ఎస్సై మురళి, కానిస్టేబుల్ మహేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శివాజీ విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/ధన్వాడ:** ధన్వాడ మండలం కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ధన్వాడ అంబేద్కర్ విగ్రహం నుంచి శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీతో సదస్సు నిర్వహించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణ రెడ్డి, శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిజీ అంబత్రియ క్షేత్రం వ్యవస్థాపకులు, నారాయణపేట జిల్లా మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్, బిజెపి నేతలు వివిధ నాయకుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిసి రోడ్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** పెద్దపోర్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ బోయిన్‌పల్లి కాశమ్మ ఆధ్వర్యంలో శనివారం నూతన సీసీ రోడ్డును ఘనంగా ప్రారంభించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి అడుగుజాడల్లో నడుస్తున్న పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ఎంపీ విధులతో ఈ రోడ్డును నిర్మించడం జరిగింది. నారాయణపేట్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంలో నిర్వహించి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ ఇంచార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఉట్కూర్ గ్రామ సర్పంచ్ రేణుక భరత్, పెద్దపోర్ల గ్రామ ఉపసర్పంచ్ కొల్లూరు మాధవి, ఉట్కూర్ గ్రామ ఉపసర్పంచ్ రమేష్, పెద్దపోర్ల గ్రామ మాజీ సర్పంచ్ రవికుమార్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రమేష్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సాయిలు, గాల నరసింహులు, జీర్ణల్లి కృష్ణయ్య, కాత్రాజ్, సాలే లక్ష్మయ్య, బోయిన్‌పల్లి వెంకటేష్, సంటిరాము, బోయిన్‌పల్లి నరేష్ కుమార్, సత్యం అంజి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తికి ఘనస్వాగతం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రంలో జిల్లా కోర్ట్ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం మహబూబ్‌నగర్‌కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఎన్‌వి శ్రావణ్ కుమార్‌లకు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛం, మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద హైకోర్టు న్యాయమూర్తులు, పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపిడిఓ తనిఖీ

**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండలం హిందూపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వం నుండి అందిస్తున్న కోడిగుడ్లు, బాలామృతం, పాలు పిల్లలకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పిల్లలకు ఇస్తున్న ఆహారంపై నివేదిక అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కే.అశ్విని, మహేష్, పంచాయితీ కార్యదర్శి మహేష్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** శ్రీకృష్ణ ఐ కేర్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ బంత్రోతూ శ్రీనివాసులు అన్నారు. కల్వకోల్ గ్రామంలోని రైతు వేదిక దగ్గర ఉచిత కంటి క్యాంప్‌ను శనివారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ చటమోని వెంకటస్వామి , సింగల్ విండోమాజీ వైస్ చైర్మన్ రాము యాదవ్, వార్డ్ మెంబర్ పెబ్బేటి శివకుమార్, నూనె వెంకటేశ్వర్ మొట్ట వెంకటేష్, కడ్తాలా కొర్నీల్, గువ్వలి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

• లోక్ అదాలత్‌ను ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి, ఎన్.వి.శ్రావణ కుమార్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకుని ఇరువర్గాలు, పరస్పర సమ్మతి, అంగీకారంతో తమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి, రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి ఎన్.వి.శ్రావణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి మాట్లాడుతూ లోక్ అదాలత్ రెండు పదాల కలయిక అని అంటే ప్రజా న్యాయ స్థానం అని పిలువబడుతుందని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 14న నిర్వహించాల్సి ఉండేదని కాని మార్చి 14,15 తేదీల్లో న్యాయమూర్తుల సమావేశం కారణంగా రెండు వారాలు వాయిదా పడి గురువారం మార్చి 28న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ వ్యవస్థ భారతదేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలలో అత్యంత సమర్థవంతమైనదిగా నిలుస్తోందని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, మోటార్ ప్రమాద క్లెయిమ్ కేసులు, బ్యాంకు రుణాలు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు వంటి అనేక కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగంగా పరిష్కరించవచ్చని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్.వి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయం అందించడమే నని అన్నారు. బలహీన, అణగారిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నట్లు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థలు, ప్రజల్లో చట్ట అవగా




హన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 2033 కేసులు గుర్తించామని, పిటీ పరిష్కారానికి మహబూబ్‌నగర్‌లో 7 బెంచిలు, జడ్చర్లలో రెండు బెంచీలు, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్.వి.శ్రావణ్ కుమార్‌లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తాలు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద పుష్పగుచ్చం మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవవందనం స్వీకరించారు.

## రెవెన్యూ డివిజన్ సాధనకు పోరాటం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని రెవెన్యూ డివిజన్ సాధన సమితి కో ఆర్డినేటర్లు వడిత్య రమేష్ నాయక్, బూరుగుపల్లి కృష్ణ యాదవ్ తదితరులు అన్నారు. శనివారం నాడు జడ్చర్ల పట్టణంలోని ఎమ్మార్పీ భవనంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కొల్లూరు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి జడ్చర్ల రూరల్ అర్బన్ మండలాలుగా ఏర్పాటు చేయాలని 2016వ సంవత్సరం నుండి నేటి వరకు గత పది సంవత్సరాలుగా పలుదఫాలుగా చేపట్టిన ఉద్యమాల ఫలితంగా మాజీ శాసనసభ్యులు దీక్షాస్థలి దగ్గర తాజా శాసనసభ్యులు అసెంబ్లీ యందు చర్చించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడంతో పాటు రెవెన్యూ శాఖ మంత్రిని జడ్చర్ల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కు కార్యాచరణకు సిద్ధం అని హామీ, వాగ్దానం ఇచ్చినా నేటి వరకు ఖచ్చితమైన కార్యాచరణ చేపట్టకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఉద్యమాన్ని పున: ప్రారంభిస్తున్నం అని తెలిపారు. అందులో భాగంగానే జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలి, అలాగే నవాబ్ పేట్ మండలంలోని కొల్లూర్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి, జడ్చర్ల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన సమితి కో ఆర్డినేటర్లు డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూరుగుపల్లి కృష్ణ యాదవ్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు లోకేష్‌ఆయక్,ఎంఆర్‌పిఎస్ నాయకులు బుడ్డోళ్ళ భీమ్ రాజ్, బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గొడుగు నరసింహులు, టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గోపాల్, సురభి విజయ్, మాచారం శ్రీనివాస్, చిన్న గోపాల్,శివ రాములు, వెంకటేష్, నెక్కొండ చారి, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం 26 వేల పెంపునకు పోరాటానికి సిద్ధం

• తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

• ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి భారీ కార్మిక సదస్సుకు తరలిరండి

**ప్రజాపక్షం/నారాయణపేట:** ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్టు ఏజెన్సీల కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలకు పెంపుకై పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నేతృత్వంలో ఏజెన్సీల వ్యవస్థ ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై కార్మిక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, థర్డ్ పార్టీ వర్క్ కాంట్రాక్టు ఏజేన్సీల ద్వారా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అందిస్తున్న ఏజెన్సీల వ్యవస్థ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల సంక్షేమానికి గొడ్డలిపెట్టు లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీల విధానం ఫలితంగా కార్మికులు, ఉద్యోగులు శ్రమ దోపిడే కాకుండా ప్రభుత్వ ఖజానా కూడా కాంట్రాక్టర్ల జేబులోకి కమిషన్ అనే పేరుతో అవినీతిమయంగా కేంద్రీకృతం అవుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో 2012 నుండి ఇప్పటి వరకు కార్మిక శాఖ కనీస వేతనం జీవోలు సవరణకు నోచుకోలేదని దీని ఫలితంగా కార్మికులకు కనీస వేతనాలు చేతికి రాక వెట్టిచాకిరికి గురవుతున్నారని అన్నారు. ఏజెన్సీలను పూర్తిగా రద్దు చేసి కార్పోరేషన్ విధానం తీసుకొచ్చి కాంట్రాక్టు ఉద్యోగులకు కార్మికులకు నేరుగా ప్రభుత్వమే వేతనాలు అందించాలని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్దతిలో కొనసాగుతున్న వారందరిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి కార్మికులకు 26 వేల వేతనం పెంపు కోసం ఏప్రిల్ 4న హైదరాబాదులో రాష్ట్రస్థాయి భారీ కార్మిక సదస్సు ఏర్పాటు చేస్తున్నామని ఈ సదస్సుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లక్ష్మయ్య, వెంకట్‌రాములు, లక్ష్మారెడ్డి, దయానంద్, కరుణాకర్, శ్రీనివాస్, మణి, వెంకటప్ప, గోవర్ధన్, వెంకటేశ్, గోవర్ధన్, వెంకటేశ్, రాజు, అరుణ, కవిత, సునీత, సత్యమ్మ, లక్ష్మి, శ్వేత, రాధా, చెన్నమ్మ, ప్రగతి, శశికళ, పద్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.




## పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది

• రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి, సీఎంఆర్‌ఎఫ్ 168 చెక్కులను రూ.38,99,500 రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క క్రమశిక్షణతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి పేద ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామని అన్నారు. పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి కి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా ఏఐపిసి ఉపాధ్యక్షులు నాగార్జున, వనపర్తి పట్టఫ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, వనపర్తి మండల మాజీ వైస్ ఎంపీపీ సురేష్, వనపర్తి అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఇర్ఫాన్, శ్రీరంగాపురం సర్పంచ్ మద్దిలేటి శ్రీనివాసులు, రమేష్, పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు ఎన్నికల వరకే.. అభివృద్ధిపై దృష్టి పెట్టాలి




• పార్లమెంటు సభ్యురాలు డికె అరుణ

**ప్రజాపక్షం/అమరచింత :** రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే ఉండాలని ఆ తర్వాత అందరూ కలిసికట్టుగా అభివృద్ధి పై దృష్టి పెట్టాలని మహబూబ్ నగర్ పార్లమెంటరీ సభ్యురాలు డీకే అరుణ కోరారు. శనివారం అమరచింత మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణానికి డీకే అరుణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ఎసెన్షియల్ అడ్వాన్స్డ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56 లక్షల రూపాయల నిధులతో నాలుగు తరగతుల గదుల నిర్మాణానికి భూమి పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. విద్యపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అమరచింత పట్టణ అభివృద్ధికి ఉపయోగించుకునేటటు ఏర్పాటు చేస్తానని డీకే అరుణ హామీ ఇచ్చారు. గ్రామపంచాయితీలలో భవనాలు, స్కూల్ అదనపు గదులు, టాయిలెట్స్, ఆసుపత్రి భవనాలు రోడ్లు అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. అమరచింతలో ఎస్బిఐ బ్యాంకు ఏర్పాటు కోసం జోనల్ మేనేజర్ తో చర్చించి ఏర్పాటుకు కృషి చేస్తానని అరుణ హామీ ఇచ్చారు. పేద విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలలో ఉండాలని విద్యార్థినిలకు ఈమె కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి, అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచందర్, దేవికి వాసుదేవ రావు, చేనేత పారిశ్రామికవేత్త మహంకాళి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదమ్మ, కౌన్సిలర్లు మేరువ రాజు, ఉషన్న, లక్ష్మి , విష్ణు, తిరుమలేష్ పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు

• జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గర్భిణీలు శిశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక పూజలు తీసుకోవాలని, లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ ప్రక్రియ లింగ ఎంపిక నిషేధం చట్టం 1994 నిబంధనలు 1996 పిసి పిఎన్‌డిటి ఎసిటి 1994 రూల్స్ 1996పైన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పీహెచ్‌సీల ఏఎన్‌ఎమ్‌లకు ఒకరోజు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా హై రిస్క్ గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడంలో ముందస్తు జాగ్రత్తలే అత్యంత కీలకమైందని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు గర్భిణీ స్త్రీలతో నిరంతరం సంబంధ కొనసాగించాలని, వారిని సమయానికి ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 1వ, 2వ, 3వ గర్భస్థ పరీక్షల తర్వాత, నెల వారీ ఆరోగ్య పరీక్షలకు హాజరుకాకుంటే అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, ఏదైనా అబార్షన్ జరిగిందా అనే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో పుట్టబోయే ఆడ ఆడ శిశువు సంరక్షణకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో ఆడబిడ్డల నిష్పత్తిని పెంచేలా కృషి చేద్దామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మాతృ శిశు మరణాలు జరగకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్చోలు డాక్టర్ తారా సింగ్, భీమ్లా నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. "ప్రతి చిన్న అడుగు.. పెద్ద విజయానికి మార్గం" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని పై తరగతులకు వెళ్తున్న విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ బయాందర్ గౌడ్ మాట్లాడుతూ.. ఇది విద్యార్థుల జీవితంలో ఎంతో ప్రత్యేకమైన రోజని కొనియాడారు. విద్యార్థులను ఉద్దేశించి పాఠశాలను ప్రిన్సిపాల్ బయాందర్ గౌడ్ మాట్లాడుతూ, ఇది విద్యార్థుల జీవితంలో ఎంతో ప్రత్యేకమైన రోజని కొనియాడారు. విద్యార్థులు పిపి 2 పూర్తి చేసుకుని 1వ తరగతిలోకి, అలాగే 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో ప్రవేశిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల మహబూబబ్ నగర్ జోనల్ ఏజీఎం వెంకట రెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారితో చాంప్స్ కో ఆర్డినేటర్ రీనా గుప్తా వైస్ ప్రిన్సిపాల్స్ షర్మిల రవళి కిడ్స్ కో ఆర్డినేటర్ మాధురి, ఏఓ శంకర్ రెడ్డి, ఉపాధ్యా బృందం పాల్గొన్నారు.

## యాసంగి క్రాప్ బుకింగ్‌లో రాష్ట్రంలో మూడవ స్థానం

• జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** యాసంగి సీజన్‌లో జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,73,707 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు గుర్తించామని అందులో భాగంగా ఇప్పటివరకు 1,64,603 ఎకరాలకు క్రాప్ బుకింగ్ పూర్తి కాగా, 94.76 శాంత నమోదు సాధించి రాష్ట్ర స్థాయిలో జిల్లా మూడవ స్థానంలో నిలవడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. ఈ ఫలితానికి మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సమిష్టి కృషి కారణమని కలెక్టర్ అభినందించారు. ఇంకా జిల్లాలో 9,104 ఎకరాల నమోదు మిగిలి ఉండగా, రెండు రోజుల్లో క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డిజిటల్ క్రాప్ సర్వేను మార్చి 30లోగా పూర్తిచేయాలని సూచిస్తూ, ఈ ప్రక్రియలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వాలంటీర్లు సమన్వయం పనిచేసి పూర్తి పారదర్శకతతో రైతుల పంటల నమోదు చేపట్టే రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

• మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండల కేంద్రంలో స్థానిక మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైనార్టీ ప్రీమియర్ లీగ్ (యంపిఎల్) సీజన్10 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక పిపిఎల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ వేడుకకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, టాస్ వేసి లీగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మైనార్టీ యువత గత పదేళ్లుగా నిరంతరాయంగా ఈటోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిత్యం పనులతో ఒత్తిడికి గురయ్యే యువతకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తితో రాణించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర, కౌన్సిలర్లు తాటికొండ కృష్ణతో పాటు దిలీప్ కుమార్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, నిజాం, నరసింహ, శివ తదితరులు పాల్గొన్నారు.

## మైదానాన్ని అభివృద్ధి చేస్తాం

• ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదనాన్ని అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దుతూ, ఆధునిక సౌకర్యాలతో సుందరీకరణ చేయనున్నట్లు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మైదనాన్ని సందర్శించి వాకర్స్, క్రీడాకారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మైదానానికి నిత్యం వచ్చే ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మైదానాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ యోగా సెంటర్‌ను కూడా అభివృద్ధి చేసి సుందరీకరణ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌గా ఎంపికైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, 57వ డివిజన్ కార్పోరేటర్ ఎంపి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాండురంగం, బాను యాదవ్, గోపాల్‌రెడ్డి, శంకరయ్య, కృష్ణ, రాజేశ్వర్, యాదయ్య, స్థానిక ప్రజలు, వాకర్స్, క్రీడాకారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలి

**ప్రజాపక్షం/పానుగల్ :** రేషన్ కార్డు లబ్దిదారులకు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని పానుగల్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పానుగల్ మండల కేంద్రంలోని తాహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్దిదారులకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఏప్రిల్ నెలలోనే ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున డీలర్లు ప్రభుత్వ ఆదేశాను సారం రేషన్ బియ్యాన్ని పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, పాల్గొన్నారు.

